# కవిత్వం - గతితార్కికత

సాహిత్య విమర్శ వ్యాసాలు

జె. సి.

సృజన ప్రచురణలు
హైదరాబాద్

కవిత్వం - గతితార్కికత
సాహిత్య విమర్శ వ్యాసాలు
జె. సి.
Poetry - Dialectics - Literary criticism by J. C.

సృజన ప్రచురణ 39
జనవరి 1991

ముఖచిత్రం : శ్యాంమోహన్

రు. 15-00

ప్రతులకు :

సృజన,
ఫ్లాట్ 11, బ్లాక్ 2, ఎం ఐ జి II,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ 500 044

ముద్రణ :

నాగేంద్ర ప్రెస్,
విజయవాడ 520 002

## క్రమం


ముందుమాట - కె. బాలగోపాల్ i

గద్దర్ పాటలు, వర్గీస్ పాటలు - భూమితల్లి కడుపుపంట 1

వచన కవిత - విప్లవ కవిత్వం 10

తెలంగాణా పోరాట పాటలు - ప్రజల పాటలు 20

విప్లవ కవితా చరణాల ఎత్తుగడలు - '1971-80 ఈతరం యుద్ధ కవిత' 36

ఎర్రటి బాటల్లో వెన్నెల నవ్వులు కరీంనగర్ ఆదిలాబాద్ రైతాంగ పోరాట పాటలు 62

చెర కవిత్వం - విప్లవ చైతన్యం 68

శ్రీశ్రీ కవిత్వ చలచందల సౌందర్యం 78

ఫ్రీ ఫ్రాంక్ వర్స్ - ఆధునికత 89

ఆధునికత - తెలుగు వచన కవిత 98

సాహిత్యంలో ప్రతీకలు 102

రస సిద్ధాంతం - దాని పుట్టు పూర్వోత్తరాలు 105

# ముందుమాట

ముందుమాట రచనకు సమీక్ష అయిపోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. రచన ఆలోచనాత్మకం అయ్యేకొద్దీ ఈ ప్రమాదం మరింత ఎక్కువ అవుతుంది.

తెలుగులో సంతృప్తికరమయిన మార్క్సిస్టు సాహిత్య పరిశీలన చాలా తక్కువ. అప్పుడప్పుడు అక్కడక్కడ రాసినవారిని పక్కకుపెట్టి చెప్పుకోదగ్గ పరిమాణంలో కృషి చేసినవారినే చెప్పుకుంటే మొదట త్రిపురనేని మధుసూదన రావునూ, తరువాత కెవిఆర్‌నీ చెప్పుకోవలసి ఉంటుంది. రాచమల్లు రామచంద్రారెడ్డి, వెల్చేరు నారాయణరావు, చేకూరి రామారావు తదితరులు మార్క్సిస్టులగానూ, మార్క్సిజం ప్రభావంలోనూ, సాహిత్య పరిశీలన చేశారు గానీ, వారి రచనల నుండి నేర్చుకోదగ్గ విషయాలు ఎలా ఉన్నా ప్రామాణిక మార్క్సిస్టు సాహిత్య పరిశీలన కోసం తెలుగు సాహిత్యంలో వెతికేవారికి అవి సంతృప్తి కలిగించజాలవు.

సాహిత్య విశ్లేషణ చేసేటపుడు వస్తువు - రూపం అనే విభజన మార్క్సిస్టు పరిశీలనలో ప్రాథమికమైనది. వస్తువు అన్నప్పుడు రచయిత చెప్పదలచుకున్న విషయం (కథ, వర్ణన లేక వాదన), రచయిత తాత్విక దృక్పథం, మానవ సంబంధాల గురించి అవగాహన, చారిత్రక, రాజకీయ సిద్ధాంతం మొదలైనవి ఉంటాయి. 'రూపం'లో అభివ్యక్తి సంబంధమైన అన్ని విషయాలూ ఉంటాయి. ప్రక్రియ, నుడికారం, పదబంధాలు, ప్రతీకలు, ప్రయోగవైచిత్రి అన్నీ రూపంలో భాగమే. వస్తువుకు, అభివ్యక్తికి సంబంధించి రచయితకు ఒక స్పష్టమైన సిద్ధాంత దృక్పథం ఉన్నా లేకున్నా వాటిలో అంతర్భాగమైన అన్ని అంశాలూ పరస్పర సంబంధాన్నీ 'ఐక్యత'నూ కలిగి ఉంటాయి. ఇన్ని అంశాల సమ్మేళనాలయిన వస్తురూపాలను సామాజిక, చారిత్రక నేపథ్యాల నుంచి పరిశీలించి ఆ అంశాల పరస్పర సంబంధాన్నే కాక వస్తురూపాల ఐక్యతను వస్తుప్రాధాన్యతను సామాజిక, చారిత్రక పునాదిని సమగ్రంగా ప్రతిపాదించి భవిష్యత్తుపైన వెలుగు ప్రసరింపజేసేది మార్క్సిస్టు సాహిత్య పరిశీలన.

ఈ పరిశీలన చేయడానికి సరిపోయే సాహిత్య సిద్ధాంతం మార్క్సిజానికి ఉందా అనే ప్రశ్న తరచూ తలెత్తుతూ ఉంటుంది. మొదట సిద్ధాంతం అనే మాటను ఏ విధంగా అర్థం చేసుకోవాలో చూడాలి. బూర్జువా విజ్ఞానశాస్త్ర సంప్రదాయంలో

సిద్ధాంతం అనే మాటకు ఒక అర్థం ఉంది. ఆచరణతో నిమిత్తం లేకుండా పరిశీలన అంశానికి సార్వత్రికమైన వివరణ ఇచ్చే విశ్లేషణా చట్రాన్ని సిద్ధాంతం అంటారు. సిద్ధాంతాన్ని ఈ రకంగా అర్థం చేసుకుంటె మార్క్సిజానికి సమగ్రమైన సాహిత్య సిద్ధాంతం లేదనే అనవలసి ఉంటుంది. చాలామంది అంటుంటారు కూడ. అయితే భౌతిక విజ్ఞానశాస్త్రం నుండి అరువు తీసుకున్న ఈ నిర్వచనాన్ని తిరస్కరించి, ప్రజా రాజకీయ ఆచరణకు మార్గదర్శకమైన వివరణ యివ్వగల విశ్లేషణాచట్రం చాలునను కుంటె పరిస్థితి మెరుగుగా ఉంటుంది. ఇవాళ్టి తెలుగు సాహిత్యం ఎందుకు వెర్రి తలలు వేస్తోందో మార్క్సిజం చక్కగానే వివరించగలదు గాని ఆ వెర్రిలోని వైవిధ్యాన్నంతా వివరించాలంటె కొంచెం కష్టమే.

అయినప్పటికీ ప్రశ్న ఇంకా మిగిలిపోతుంది. రాజకీయ ఆచరణకు మార్గదర్శ కంగా నిలిచే సాహిత్య సిద్ధాంతమైనా మార్క్సిజానికి ఉందా? రాజకీయ ఆచరణ అన్నపుడు ప్రస్తుత పోరాట అవసరాన్నే కాక నూతన సమాజ నిర్మాణ అవసరాలను కూడ దృష్టిలో పెట్టుకుని ఈ ప్రశ్నను వేసుకోవాలి. ప్రస్తుత పోరాట అవసరమే ప్రమాణమయితే ప్రజలను ఉత్తేజపరచి విప్లవోన్ముఖులను చేసేదే ప్రజాసాహిత్య మవుతుంది. తక్కినదంతా విమర్శనీయం అవుతుంది. కాని నూతన సమాజ నిర్మాణ భారాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమాణాలను నిర్ణయించుకునేట్టయితే మానవ మను గడకు సంబంధించిన సకల పార్శ్వాలూ అస్తిత్వ సందిగ్ధాలూ పరిగణనలోనికి వస్తాయి. సాహిత్య వస్తు శిల్పాలను ఉత్పత్తి సంబంధాల పునాదిమీద నిలబెట్టి రచన లోని తాత్విక దృక్పథం నుండి ప్రతీకలు ప్రయోగవైచిత్రి దాక అన్ని విషయాలను నూతన సమాజ స్వరూప నిర్ధారణ మీద, ఆవిష్కరణ కర్తవ్యం మీద, వెలుగు ప్రసరించేట్లు విశదీకరించగల సాహిత్య సిద్ధాంతం మార్క్సిజానికి ఉందా? ఉంది అని సమాధానం చెప్పడం ప్రస్తుతానికి సాహసమే అవుతుందేమో. మార్క్సిస్టు దృక్పథా నికి ఆ సత్తా వుంది. కాని దృక్పథమే (world outlook) సిద్ధాంతం (theory) కాదు. ఈ రెండిటికి తేడా స్పష్టంగా తెలియకపోవడంవల్ల మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని ఆమోదించేవాళ్ళు చేసే సాహిత్య విమర్శ వెనుక మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం ఒకటి ఉందని భావించడం జరుగుతోంది.

అందుకే త్రిపురనేని మధుసూదనరావునూ, కెవీసీ ప్రత్యేకించి ప్రస్తావించడం జరుగుతూ వుంది. సమస్య పరిష్కారం జటిలమని భయపడి ఆ ప్రయత్నాన్నే పక్కకు పెట్టి తప్పించుకు తిరగడానికి సాహిత్యానికి స్వయంప్రతిపత్తి ఉందని లేక

(Raymond Williams లాగ), సాహిత్యంకూడా వ్యవసాయంలాగే ఒక ఉత్పత్తే నని సిద్ధాంతీకరించి సాహిత్యాన్ని స్వయం సమృద్ధమయిన మానవవ్యాపారంగా విశ్లేషించే పలాయనవాదాన్ని ఆశ్రయించకుండా, వీళ్ళిద్దరూ మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత ఆవిష్కరణ బాధ్యతతో ధైర్యంగా తలపడుతున్నారు. ఆ ప్రయత్నం ఎంత ఫలవంతమైందో చూడవలసిన అవసరం ఉంది.

వీలైనన్ని తక్కువ ప్రత్యయాలతో సరళమైన సూత్రీకరణలతో వివరణ యివ్వగలగడం మంచి సిద్ధాంతాల లక్షణం. Economy of concepts and Explanatory principles ఉండాలన్నమాట. ఈ విషయంలో జేసీని తప్పు పట్ట డానికి లేదు. నిజానికి జేసీమీద విమర్శ ఎక్కడ వస్తుందంటే ఈ పొదుపు మరీ ఎక్కువయితే వివరణ పరిధి కుదించుకుపోయే ప్రమాదం వుంది.

శ్రమను, శ్రమదోపిడీని జేసీ సామాజిక జీవితానికి పునాదిగా భావిస్తారు. సాహిత్యం, కళ శ్రమలో పుట్టాయి. శ్రమ చేసే క్రమంలో శ్రామికులు బాహ్య ప్రపంచాన్ని తమదిగా స్వంతం చేసుకుంటారు. ఒక బాహ్యవస్తువుగా, విడిగా ఉన్న ప్రకృతి, సమాజం శ్రమక్రమంలో మనిషి పరమవుతాయి, అర్థవంతమవుతాయి. ఆ క్రమంలోనే ఆలోచన పుట్టింది. దానికి సాహిత్య రూపం ఇచ్చే పాట పుట్టింది. ఈ పాట లయప్రధానమైంది. మనుషులు ఎప్పుడైనా ఎక్కడైనా శ్రమక్రమాన్ని లయబద్ధంగా మలుచుకుంటారు. అది శ్రమను ఒక గాడిలో పడేసి అలసటను తగ్గిస్తుంది. ఈ శారీరిక అవసరంతో పాటు ఒక మానసిక అవసరం కూడ ఉంటుంది. ఏ లయతో శరీరం కదులుతుందో అదే లయతో నిబద్ధమైన పాట శ్రమక్రమాన్ని మరింత సునాయాసం చేస్తుంది. శ్రమ అన్నపుడు సంప్రదాయకంగా ఆ మాటకు యిస్తున్న అర్థంలో వస్తూత్పత్తినే జేసీ ప్రస్తావించినా అన్నిరకాల శ్రమనూ ఈ విశ్లేషణ వర్తిస్తుంది.

ఒక్క సాహిత్యమే కాదు, అన్నిరకాల ఆలోచన శ్రమను ఆశ్రయించి రూపొందుతుంది. ప్రకృతిని గురించి, ప్రకృతికి మనిషికి ఉన్న సంబంధాన్ని గురించి, మనుషుల మధ్య వుండే సంబంధాల గురించి అవగాహన ఇదే క్రమంలో రూపొందు తుంది. ఈ ఆలోచనల్లో ఆదిమ భౌతికవాదంతో పాటు విజ్ఞానపరిమితి నుండి పుట్టిన అద్భుతీకరణ (mystification) కూడ ఉంటుంది. ఈ ప్రాకృతిక అద్భుతీకరణ పరాయీకరణ యొక్క తొలిరూపం.

చారిత్రక పరిణామక్రమంలో ఒకరి శ్రమ మరొకరి సొత్తయి వివిధరూపాల సామాజిక అసమానతలు ఏర్పడేసరికి శ్రమనుండి పుట్టిన ఆలోచన పరాయీకరణ చెంది పెత్తనం చేసే వర్గాల చేతుల్లోకి పోతుంది. అంటే శ్రామికులు ఆలోచించడం మానేస్తారని కాదు. వాళ్ళ ఆలోచనలు వాళ్ళవి కాకుండా పోతాయి. రూపంలో కాకున్నా, సారాంశంలో అవి పాలకవర్గాల భావాలయిపోతాయి. కర్మ, పాపపుణ్యాలు, ధర్మం, పరలోకం, పరమత్వం సామాజిక చైతన్యానికి పునాదిరాళ్ళవుతాయి. సాహిత్యం కూడా పరాయీకరణ చెంది దోపిడీవర్గాలకు, సామాజిక పెత్తనానికి అనుగుణ్యమైన రూపాన్ని, స్వభావాన్ని సంతరించుకుంటుంది. భావాలలో అవాస్తవికత, రూపంలో సంక్లిష్టత పెరుగుతాయి. పాటగా పుట్టిన కవిత్వం ఛందోనియమాలకు నిబద్ధమై పోతుంది. పాటగా మిగిలిపోయినది కూడ భావంలో ప్రజలపాట కాకుండా పోతుంది. 'జానపద పాటలు' ప్రజల పాటలుగా పుట్టి బ్రాహ్మణ భావజాలాన్ని ఒంటబట్టించుకుని పరాయివై పోయే వైనాన్ని జేసీ ఉదహరిస్తారు. అయితే అన్నిపాటలూ శ్రామికవర్గ చైతన్యంతో పుట్టి ఆ తరువాత బ్రాహ్మణీకరణ చెందాయని భావించనవసరం లేదు. కాలక్రమంలో ప్రజలచైతన్యమే బ్రాహ్మణీకరణ చెందిన పిదప జానపద పాటలు పుట్టుకలోనే పరాయీకరణకు లోనయి వుంటాయి.

చారిత్రక క్రమంలో కొత్త దోపిడీ వ్యవస్థ, కొత్త దోపిడీ సంబంధాలు, ఏర్పడినప్పుడు సాహిత్యం తదనుగుణ్యమయిన మార్పుకు లోనవుతుంది. పునాది సంబంధాలలోని మార్పుననుసరించి సాహిత్య వస్తువులలోనే కాక, శిల్పసంబంధమయిన విషయాలలో కూడ మార్పులు వస్తాయి. భూస్వామ్య వ్యవస్థకూ పెట్టుబడిదారీ వ్యవస్థకూ మధ్యగల తేడాను జేసి వాడకపువిలువలు - అమ్మకపు విలువలు అనే గతితర్కం ప్రాతిపదికగా వివరిస్తారు. ఈ రెండు సమాజాల సాహిత్యానికి మధ్యగల తేడాను ఆ ప్రాతిపదికమీద విశ్లేషిస్తారు. ఉత్పత్తి అయ్యే వస్తువులన్నీకూడ (శ్రమశక్తితోసహా) అమ్మకపు విలువలగా ఉత్పత్తి కావడం (Generalised commodity Production) బూర్జువా వ్యవస్థ ప్రాథమిక లక్షణం కాగా, ప్రధానంగా వాడకపు విలువలగా ఉత్పత్తి కావడం భూస్వామ్య వ్యవస్థ లక్షణం అనే అవగాహన ఈ విశ్లేషణకు పునాది. అయితే ఉత్పత్తి అమ్మకపు విలువల రూపంలో జరగడం బూర్జువా వ్యవస్థ ఆర్థిక పునాదికి నిజంగానే నిర్ణాయక (Definitive) లక్షణం కాగా, ఉత్పత్తి వాడకపు విలువల రూపంలో జరగడం భూస్వామ్య వ్యవస్థ ఆర్థిక పునాదికి దానంతటదే నిర్ణాయక గుణం కాదు. ఇతర ఉత్పత్తి సంబంధాలను లెక్కలోకి తీసు

కోకుండ భూస్వామ్య ఆర్థిక వ్యవస్థను ప్రతిపాదించడం సాధ్యం కాదు. అదృష్ట వశాత్తూ, 'రస' 'ధ్వని' సిద్ధాంతాలను చర్చించే వ్యాసంలో జేసి ఈ అసమగ్ర నిర్వచనం మీద ఆధారపడకుండ, మన దేశ చరిత్రలో భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి కోశాంబి ప్రతిపాదించిన సంక్లిష్టమయిన చారిత్రక గమనాన్ని సాకల్యంగా ఆధారం చేసుకున్నారు. ఆదిమ భౌతికవాద ప్రేరణతో ప్రారంభమయిన 'రస' 'ధ్వని' సిద్ధాంతాలు భూస్వామ్య వ్యవస్థ ముదిరే క్రమంలో అలౌకిక పరమత్వాన్ని సాధించుకున్న క్రమాన్ని వివరంగా చూపించారు. వైద్యానికి కూడా మన చరిత్రలో ఇదే గతి పట్టింది. పాంచ భౌతిక రసాయన శాస్త్రం మీద ఆధారపడిన ఆదిమ చికిత్సా విజ్ఞానం బ్రాహ్మణీకరణ చెంది పారలౌకిక 'జ్ఞానం' అయింది, ఆయుర్వేదమయింది.

శ్రమకు తోడుగా పాటగా ప్రారంభమయిన కవిత్వం భూస్వామ్య వ్యవస్థలో ఛందోబద్ధ కవిత్వమయి, 'మాత్రాఛందస్సుల ప్రజాస్వామిక యుగంలోకి' ఈ శతాబ్దంలో ప్రవేశించి, చివరికి వచన కవిత్వం అయింది. తిరిగి కవిత్వం ప్రజల పరం కావాలంటే వచన కవిత్వాన్ని వదిలిపెట్టి పాటను చేపట్టక తప్పదని జెసి గుర్తిస్తారు. అయితే దానికి విప్లవ రాజకీయ ఆచరణ అవసరం అవుతుంది. ఆ ఆచరణలో భాగమయిన పాట తిరిగి కవితను ప్రజల పరం చేస్తుంది. ఆ పాట తన బాణీలను పరాయీకరణకు లోనయిన 'ప్రజల పాట' అయిన జానపద సాహిత్యం నుండి ఎంచుకున్నా, వస్తువులో అది ఇంకెంత మాత్రం పరాయీకరణకు లోనయిన పాట కాదు. స్పష్టమయిన విప్లవ సాహిత్యం అవుతుంది.

ఈ గతితార్కిక క్రమానికి కవితారీతులూ ప్రతీకలూ అలంకారిక ప్రయోగాలూ పదబంధాలూ ఏ విధంగా లోనవుతాయో జెసి చాలా చక్కగా వివరించగలిగారు. శిల్పాన్ని గురించి చర్చించడం అనవసరం అనుకునే వాళ్ళకే కాదు, శిల్పాన్ని గురించి చర్చించడం మార్క్సిజానికి సాధ్యం కాదనుకునేవాళ్ళకు కూడ జెసి విశ్లేషణ మంచి సమాధానం. గతితర్కాన్ని విడమరచి చెప్పే విశ్లేషణ స్వయంగా ఎంత గతితార్కికంగా ఉండాలో శ్రీశ్రీ మీద జెసి రాసిన వ్యాసం చక్కగా చూపిస్తుంది.

చాలా పొదుపయిన సిద్ధాంతంతో చాలా విషయాలు జెసి చెప్పగలిగారు. విశ్లేషణకు బాట చూపగలిగారు. మరికొన్ని ప్రశ్నలకు ఈ సిద్ధాంత చట్రం పరిధిలోనే సమాధానం చెప్పగలం. సాహిత్యానికి ఆర్థిక పునాదితో ఉన్న సంబంధాన్నే కాక

ఇతర ఉపరితల అంశాలతో వున్న పరస్పర సంబంధాన్ని ఈ సిద్ధాంత చట్రంలోనే వివరించవచ్చును.

ఒక శేష ప్రశ్నలకు వద్దాం. సంగీతాన్నీ కవిత్వాన్నీ చర్చించేటప్పుడు లయకు (rhythm) ప్రాధాన్యం ఉంటుంది. కవిత్వంలో లయ శ్రమతో పుట్టిందేమో గానీ కవిత్వం శ్రమనుండి పరాయీకరణ చెందిన తరువాత కూడ లయను కోల్పో లేదు. నిజానికి భూస్వామ్య సాహిత్యంలోనే లయ వెర్రితలలు వేసి తానే ఒక పరమార్థం అవుతుంది. రాగాలాపన, వాద్య సంగీతం మొదలయిన శుద్ధ సంగీత రూపాలు కూడ భూస్వామ్య వ్యవస్థలోనే అభివృద్ధి చెందాయి. క్రమబద్ధమయిన శబ్దానికి లయ నిబద్ధమయిన భావాలకూ శ్రమ భారాన్నే కాదు, జీవితంలోని అన్ని రకాల అసమగ్రతనూ అసంతృప్తినీ మరపింపజేసే గుణం ఉంది. తొలినాడు శ్రమ లోనే పాట పుట్టి ఉండవచ్చును గానీ, శ్రమ విభజన పెరిగి జీవితం పరిధి విస్త రించిన తరువాత అదే పాట (ఇప్పుడు పరాయీకృతమయిన కవిత్వం రూపంలో) కొత్త జీవిత రంగాలలోని అసంతృప్తికి ఉపశమనంగా పని చేస్తుంది. అశక్తత వల్లనో అసంసిద్ధత వల్లనో మనం వ్యక్తం చేయలేని అనుభవాలను వ్యక్తం చేస్తుంది. జీవిత అనుభవంలోని అవ్యవస్థ, అసమగ్రతలను మరపింపజేసే సంపూర్ణ అనుభవాన్నీ సమగ్ర సౌందర్యాన్నీ, ఎగుడుదిగుడుగా వుండే మానవ అస్తిత్వాన్ని మరపింపజేసే లయబద్ధతనూ కల్పిస్తుంది. శ్రమ విభజన, దానితోబాటు అనుభవాల పరిధి, పెరిగేకొద్దీ ఈ అవసరాలు పెరుగుతాయి. సాహిత్యం ఈ సామా జిక అవసరాన్ని సాధిస్తుంది. కాబట్టే అది పాలక వర్గాల చేతిలో ప్రచార ఆయు ధంగా పనిచేస్తుంది.

అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేయడంలో పాటకు గల ప్రధాన స్థానాన్ని నొక్కి చెప్పే సిద్ధాంతంతో బాటు, సామాజిక శ్రమ విభజన ఫలితంగా అట్టడుగు స్థాయిని దాటి ఏ కొంచెం పైకిపోయిన వారినయినా ఏదో ఒక మేరకు ఆకట్టుకునే ఈ సాహిత్య అవసరాన్ని విశ్లేషించే సిద్ధాంతమూ కావాలి. అట్టడుగు వర్గాలకు చెందని వారంతా పాలకవర్గాలే కారుకాబట్టి ఈ విశ్లేషణ తక్షణ రాజకీయ అవసరంకూడ. అంతకంటే ముఖ్యంగా, భవిష్యత్ సమాజంలో సాహిత్యానికి గల పాత్రను ఏ విధంగా అర్థం చేసుకోవాలో ఏ విధంగా పరిపూర్తి చేయాలో విశ్లేషించు కోవడానికి ఇది అవసరం. ఈ విశ్లేషణ కొరవడిన కారణంగానే చైనా సాంస్కృతిక విప్లవంలో ఏది విప్లవ సాహిత్యమో తెలీక టోకుగా అంతటినీ సెన్సార్ చేసేయడం జరిగింది.

మానవ జీవిత అనుభవంలోని ఈ అవ్యవస్థ, అపరిపూర్ణత, సహజ సిద్ధమని, వర్గసమాజం ఎప్పుడూ సిద్ధాంతీకరించింది. అది కర్మ ఫలితమనో, మానవజాతి పుట్టుకలోనే వున్న పాపంఫలితమనో, భగవంతుడి ఇచ్ఛ అనో సంప్రదాయ మత సిద్ధాంతాలు చెప్పగా, ఈ వివరణకు ఈ శతాబ్దంలో ఫ్రెంచి అస్తిత్వవాదం లౌకిక రూపం ఇచ్చి ఈ అవ్యవస్థ మానవ మనుగడలో అంతర్లీనమయిన అస్తిత్వ సందిగ్ధం (the predicament of human existence) అనింది. ఈ అవ్యవస్థ ఎంత వరకు మానవ సామాజిక జీవితంలో అనివార్యమో ఏ మేరకు చరిత్ర కల్పితమో విశ్లేషించడం సాహిత్య చర్చకు చాలా అవసరం. చాలావరకు ఇది చరిత్ర కల్పితమే. అధికారాన్నీ అస్తులనూ అంతరాలనూ నిర్మాణ సూత్రాలుగా గల సమాజం మనిషికి మానవీయమయిన మనుగడ అసాధ్యం చేసి దాని స్థానంలో పరిపూర్ణుడయిన భగవంతుడిని నిలబెట్టింది. పరమ వ్యవస్థితుడయిన వాడి లీలలను వర్ణించే సాహిత్యంతో అసమగ్రమైన మానవ జీవితానికి ఉపశమనం కలిగించింది. దేవుడు పోయి వాడి స్థానంలో జేమ్సుబాండ్ వచ్చినా ఈ విషయంలో తేడా లేదు. నిజమయిన ధైర్యానికీ పరాక్రమానికీ స్థానంలేని జీవితం ఈ 'టూ టౌన్ రౌడీల' కథలు వినీ చదివీ వీక్షించీ సంతృప్తి చెందాలి. రేజర్‌బ్లేడ్ అడ్వర్టయిజ్‌మెంట్‌లో 'మగతనాన్ని' చూసుకొని సంబరపడాలి. ప్రేమకు సంతృప్తికరమయిన అర్థం చెప్పుకోలేని జీవితం దానిని లైలామజ్నూ కథలోనో ప్రెజర్ కుక్కర్ అడ్వర్టయిజ్‌మెంట్‌లోనో చదువుకోవాలి. నిజాయితీకీ సత్యానికీ త్యాగానికీ దేనికీ స్థానం ఇవ్వని సమాజం ఆ ఖాళీలను మానసికంగా పూరించే కల్పనలను మనకోసం సృష్టించిపెట్టింది. జీవితాన్ని కళతో కవిత్వంతో సంగీతంతో పరిపూర్ణం చేసుకునే ఈ అవసరం ఉండబట్టే పాలకవర్గ భావజాలం ఆ చైతన్య రూపాలలోనికి ప్రవేశించి మెదళ్ళను కొనేస్తూవుంది.

బూర్జువా సాహిత్యంలో ఒక సంప్రదాయం - ముఖ్యంగా ఆధునిక వచన కవిత్వం-జీవితంలోని అపరిపూర్ణతను భగవంతుడివంటి పరాయీకృత రూపాలతో పరిపూర్తి చేసేబదులు, పదునుగా వ్యక్తం చేయడం ద్వారా జీవిత సందిగ్ధాన్ని శోధన చేసే ప్రయత్నం చేస్తుంది. ప్రత్యక్షంగానో పరోక్షంగానో అస్తిత్వవాదం దాని తాత్విక పునాది. నిజానికి విప్లవ కవిత్వంగా పిలవబడే దానిలో చాలాభాగంకూడ ఈ కోవకు చెందినదే. అది సందిగ్ధాన్ని వ్యక్తీకరించినంత సహజంగా పరిష్కారాన్ని చెప్పదు, చెప్పజాలదు. ఎందుకంటే వచన కవిత్వాన్ని స్వంతం చేసుకున్న పెటీబూర్జువా వర్గానికి విప్లవం పరిష్కారం దొరకని అస్తిత్వ సందిగ్ధమే (existential predicament) తప్ప సందిగ్ధాలకు పరిష్కారం కాదు.

అయితే, మానవ జీవిత అనుభవంలోని అపరిపూర్ణత ప్రధానంగా సామాజిక అసమానతలనుండీ వర్గవ్యవస్థనుండీ పుట్టిందే అయినా కొంతభాగం మానవ మనుగడలో అంతర్లీనమయిన విషయమే. వ్యక్తిపరంగా చూస్తే మానవ జీవితంలో అసమగ్రత, అపశ్రుతి, ఎప్పుడూ ఎంతోకొంత ఉంటాయి. అభివృద్ధి చెందిన కమ్యూనిస్టు సమాజంలోనయినా సరే వ్యక్తి వ్యక్తిగా సంపూర్ణంగా సంతృప్తికరమయిన జీవితాన్ని పొందడం సాధ్యమవుతుందనుకోవడం భ్రమే. వ్యక్తి మానవాళితో సంపూర్ణంగా మమేకం అయి తానొక వ్యక్తిగా అనుభూతి చెందడం మానేయగలిగిననాడే ఈ అపరిపూర్ణత పోతుంది. అంతటి చైతన్యం బహుశా ఎప్పటికీ అందరికీ పూర్తిగా సాధ్యం కాదేమో. ఆ వైపు మానవ జీవితాన్ని నడిపించే కర్తవ్యం కమ్యూనిజం మీద వుంది. ఆ కర్తవ్యం ఊహకుకూడ అందని నిరాశావాదం మానవ అనుభవంలోని అపరిపూర్ణతకూ అసమగ్రతకూ అపశ్రుతికీ పరమత్వాన్ని (absolute status) ఆపాదించి అస్తిత్వ వాద సిద్ధాంతాన్ని ఆవిష్కరించింది. ఆ దృక్పథాన్ని మార్క్సిజం తిరస్కరించేముందు దాని ఆవిర్భావంలోని నిజమయిన సందిగ్ధాన్ని గుర్తించవలసిన అవసరం ఉంది. సామాజిక శ్రమవిభజన పెరిగి సమాజం సాంకేతికంగా పురోగమించిన కొద్దీ ఈ సందిగ్ధం పెరిగే అవకాశం ఉందనికూడ గుర్తించవలసిన అవసరం ఉంది. ఆ సందిగ్ధానికి సాహిత్యంలో సహజమయిన స్థానం ఉంది. ఆ సందిగ్ధాన్ని పాటకంటే వచనకవిత్వమే బాగా వ్యక్తీకరించగలదు కాబట్టి వచన కవిత్వానికి స్థానం ఉంది. ఆ సందిగ్ధం మన జీవితాన్ని బలంగా తాకినప్పుడు సాధారణ అభివ్యక్తి రూపాలు సంతృప్తినీయవు కాబట్టి ప్రయోగవైచిత్రికీ అధివాస్తవికతకూ సాహిత్యంలో స్థానం ఉంది. వీటి చాటున ఈ సందిగ్ధాన్ని శాశ్వతమయిన జీవిత సూత్రంగా చిత్రీకరించే పలాయన తత్వాన్నీ, నైరాశ్యాన్ని ప్రచారం చేసే ప్రయత్నాన్నీ, ప్రయోగ చాపల్యాన్నీ, తప్పక విమర్శించవలసిందే. అయితే వ్యక్తికీ మానవాళికీ మధ్యనున్న వైరుధ్యం పరిష్కారం కానంతవరకూ మనతో ఉండే ఈ అస్తిత్వ సందిగ్ధాలకు సాహిత్యంలో స్థానం ఉంటుందని మరచిపోయినా, దానిని వివరించే సిద్ధాంతం అవసరమన్న విషయాన్ని విస్మరించినా, పొరబాటు అవుతుంది.

సాహిత్యంలో మరొక గతితర్కం కూడ వుంది. అది గతానికీ భవిష్యత్తుకూ మధ్యనున్న గతితర్కం. భవిష్యత్తు గతాన్ని అభావం చేస్తూ ఆవిర్భవిస్తుంది. అయితే భవిష్యత్తుకు బీజం గతంలోనే ఉంటుంది. రాబోయే కాలాన్ని గురించి మనం ఊహించుకునే ఉన్నతమయిన విలువలన్నీ చరిత్రలోనే పుట్టాయి.

అవి సంపూర్ణంగా కార్యరూపం దాల్చగల పరిస్థితులు లేని దశలోనే మనుషుల ఆశయాలలో సంపూర్ణ రూపం తీసుకున్నాయి. సత్యం, అహింస, త్యాగం, ప్రేమ మొదలయిన విలువలు ఆదర్శాలుగా మనుషులకు ఎప్పుడూ ఆకర్షణీయమయినవి కాబట్టి వాటి పేరుమీద అణచివేతను సమర్థించే సామాజిక నీతిని వర్గసమాజం తయారుచేయగలిగింది. అమలుచేయగలిగింది. ఈ బూటకాన్ని తిరస్కరిస్తూ అదే సమయంలో ఆ ఆదర్శాలనూ విలువలనూ వాటి నిజమయిన అర్థంలో కాపాడుకోవలసిన గతితార్కిక కర్తవ్యం మనమీద ఉంది. (జెసి ఈ వ్యాసాలలో ఒకటి రెండు చోట్ల దేవుడితోబాటు ప్రేమ త్యాగం మొదలయినవాటిని కూడ పరాయీకృత విలువలని ఒక్కగాటన కట్టి తిరస్కరించడం కొంత ఇబ్బంది అనిపించక మానదు.) సాహిత్యంలో గతకాలపు చరిత్రనుండీ పురాణాలనుండీ ఇతివృత్తాలనయినా ప్రతీకలనయినా ఎంచుకునేటప్పుడు ఈ గతితార్కిక దృష్టికి ప్రాధాన్యం ఉంటుంది. చరిత్రనూ పురాణాలనూ కాళ్ళమీద నిలబెట్టి చూడవలసి ఉంటుంది. ఒక గుహుడూ, ఒక జటాయువూ విప్లవ సాహిత్యంలో సామంత దాస్యానికి ప్రతీకలవుతారు. కాని స్నేహానికి కాదు. ఒక విభీషణుడు అవకాశవాదానికి ప్రతీక అవుతాడు కాని ధర్మనిరతికి కాదు. విప్లవానికి ఖాండవవనాన్ని దహనం చేసిన అగ్ని ప్రతీక కాగలదేమో కాని హోమాగ్ని కాగలదా ? శ్రీశ్రీ ఉపయోగించిన పౌరాణిక ప్రతీకలు ఆయన గతితార్కిక దృష్టివల్ల తమ పౌరాణికతను అధిగమించి అభావం చేశాయన్న జేసి అభిప్రాయం సత్యమేనా ? శ్రీశ్రీ కవిత్వంలోని అపౌరాణికమైన వేగంవల్ల ఆ ప్రతీకలు తమ 'గతానుగతికత్వాన్ని' అధిగమించినట్లు అనిపిస్తుంది కాని ప్రతీకల ఎంపికలో శ్రీశ్రీ అంతటి గతితార్కికతను నిజంగా ప్రదర్శించాడా అంటే అనుమానమే. శ్రీశ్రీ సంగతి అటుంచి గతానికీ భవిష్యత్తుకీ మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని సాహిత్య సృజనలోనూ, విమర్శలోనూ సమగ్రంగా ఆకళింపు చేసుకోవలసిన అవసరం చాలా ఉంది.

మార్క్సిజం పట్టిపోయిందని ఇవ్వాళ పాశ్చాత్య దేశాల్లో చాలామంది ప్రకటిస్తున్నారు. విప్లవ పోరాటం పట్టిపోయిన చోట విప్లవ సిద్ధాంతం పట్టిపోవడంలో ఆశ్చర్యంలేదు. దురదృష్టవశాత్తూ, పట్టిపోయిన పాశ్చాత్య మార్క్సిస్టు సంప్రదాయమే మన మేధావులకు ప్రమాణాలు నెలకొల్పుతూ వుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలలో వచ్చిన నయా మార్క్సిస్టు ఆలోచన కొన్ని ప్రశ్నలు లేవదీయగలిగింది. కొంత కొత్త విశ్లేషణ చేయగలిగింది. అప్పటికే

కరడుగట్టిపోయిన కమ్యూనిస్టు పార్టీల సిద్ధాంతవేత్తలు ఆమోదించని అన్వేషణ చేపట్టగలిగింది. 'స్టాలినిజం' అనే తిట్టుమాటతో అందరూ విమర్శిస్తూ ఉన్న ఆర్థిక నియతివాదం నిర్దేశించిన సిద్ధాంత మూర్ఖంతో విసుగు చెందినవారికి ఈ నయా మార్క్సిస్టు ఆలోచన తొలి పరిచయంలో కొంత ఉత్తేజాన్ని ఈయవచ్చును గాని మరికొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే అది సోవియట్ సంప్రదాయంలోని చెడుతోపాటు మౌలికమైన కమ్యూనిస్టు ఆదర్శాన్నే తిరస్కరిస్తుందేమోనన్న అనుమానం రాక మానదు. చాలా సంక్లిష్టమయిన పదజాలంతో, కొంత నవీన ఆలోచనతో మనల్ని ఆకట్టుకునే ఆధునిక పాశ్చాత్య మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతవేత్తల కంటే ఆర్థిక నియతివాద సంప్రదాయానికి చెందినా పోరాటకాలానికి చెందిన క్రిస్టఫర్ కాడ్వెల్ వంటివారే మేలనిపిస్తుంది.

నిజమైన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం ఆల్థుస్సర్ (Althusser). రేమాండ్ విలియమ్స్ (Raymond Williams) ల ఎండమావులలో దొరకదు. జేసీమీద చాలా ప్రభావం చేసిన జార్జి థామ్సన్ వంటి విమర్శకుల కృషిని ఈ గడ్డ మీద కొనసాగించాలి. ఒక గద్దర్‌ను తయారుచేయగలిగిన ఈ ప్రజాపోరాటమే మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత సమస్యలకు పరిష్కారాన్ని కూడా చూపగలదు. అయితే ఆ అన్వేషణ జార్జి థామ్సన్, క్రిస్టఫర్ కాడ్వెల్‌ల కాలానికి ఉన్న అనుభవ పరిమితిని అధిగమించి ఈ మధ్య కాలంలో గడచిన చరిత్రను, ప్రత్యేకించి సోషలిస్టు దేశాల తిరోగమనం నుండి పుట్టిన ప్రశ్నలను, అవగాహనను ఆకళింపు చేసుకుని ముందుకు సాగాలి.

21-2-1991
విజయవాడ

కె. బాలగోపాల్